క్లుప్తంగా

మెగా నేత్రవైద్య శిబిరం



శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

బొండపల్లి: మండలంలోని కొవ్వాడపేట గ్రామంలో గురువారం ధీర ఫౌండేషన్ కార్యదర్శి బొత్స సందీప్ ఆధ్వర్యంలో గురువారం మెగానేత్రవైద్యశిబిరం నిర్వహించారు. విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది శిబిరంలో సేవలందించారు. కొవ్వాడపేటతో పాటు చుట్టు పక్క గ్రామాల నుంచి శిబిరానికి వచ్చిన 120 మందికి కంటి పరీక్షలు చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించారు. అలాగే ఉచితంగా మందులు అందజేశారు.

1న వీరాంజనేయస్వామి తీర్థం

గంట్యాడ: మండలంలోని పొల్లంకి గ్రామంలో ఏప్రిల్ 1వ తేదీన వీరాంజనేయస్వామి తీర్థం నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త కర్రి కృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.ఉదయం 6 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదానం, 2 గంటల నుంచి స్వామి వారి ఉత్సవ విగ్రాహాల ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు. అలాగే తీర్థం సందర్భంగా కబడ్డీ, ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉల్లాసంగా గుర్రాల పరుగు పోటీలు



పోటీల్లో దౌడుతీస్తున్న గుర్రం

జామి: శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని గొడికొమ్ము గ్రామంలో రామాలయ ధర్మకర్త బొబ్బిలి రమణబాబు, సర్పంచ్ పిల్లల భవానీ, గ్రామపెద్దల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన గుర్రాల పరుగు పోటీలు ఉల్లాసంగా సాగాయి. పోటీల్లో ఏడు గుర్రాలు పాల్గొనగా, విజయగనరం పెప్సీ రాజు గుర్రం మొదటి స్థానంలో, అలమండ సంత శ్రీనివాసరాజు గుర్రం ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

సత్యసాయి మందిర నిర్మాణానికి శంకుస్థాపన



మందిర నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న చిన్నారావు, సత్యసాయి భక్తులు

గుర్ల: మండలంలోని పెనుబర్తి గ్రామంలో సత్యసాయి బాబా మందిర నిర్మాణానికి సత్యసాయి భక్తులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు అంబల్ల చిన్నారావు గురువారం భూమిపూజ చేశారు. గ్రామంలో సత్యసాయి భక్తులు అంతా కలిసి మందిర నిర్మాణానికి ముందుకు వచ్చారు. మందిరంలోనే సామాజిక సేవ కార్యక్రమాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఏడాదిలోపు నిర్మాణం పూర్తి చేయాలని తీర్మానం చేశారు.

రేపు బొండపల్లిలో ఆసరా సంబరాలు



మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: మండల కేంద్రంలోని భువి లేఅవుట్‌లో శనివారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ చల్లా చలంనాయుడు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల అధికారులు, సచివాలయ కార్యదర్శులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ ఈ సంబరాలకు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. అంతా సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సంబరాలకు ఆసరా లబ్ధిదారులు హాజరయ్యేలా చూడాలన్నారు. సర్పంచులు,ఎంపీటీసీలు, నాయకులు హాజరు కావాలని కోరారు. ఎంపీడీఓ ఏ.వేదవతి, ఈఓపీఆర్డీ సుగుణాకర రావు, వెలుగు ఏపీఎం కె.సులోచనాదేవి, ఏపీఓ కె.కృష్ణవేణి పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి గ్రామంలో శుక్రవారం ఉదయం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పాల్గొంటారని, మండల అధికారులు, సంబంధిత సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలని సూచించారు.

కమనీయం... కడు రమణీయం



శృంగవరపుకోట: గవరపాలెంలో సీతారామ కల్యాణోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



శృంగవరపుకోట: రాజీపేటలో కల్యాణోత్సవానికి ఉత్సవ మూర్తులను తీసుకెళ్తున్న ఎమ్మెల్సీ రఘురాజు దంపతులు

- వాడ వాడలా శ్రీరామనవమి వేడుకలు
- వైభవంగా సీతారాముల కల్యాణోత్సవాలు

శ్రీరామనవమి వేడుకలను గురువారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. రామాలయాల్లో భక్తులు ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారాముల విగ్రహాలను ఊరేగించి, వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ రాములోరి కల్యాణం కమనీయంగా, కన్నుల పండువగా నిర్వహించారు. సకలగుణా భిదాముడు అయిన శ్రీరామచంద్రుని కల్యాణం ఊరందరికీ ఉత్సవమే కావడంతో రామాలయాలు భక్తజన సందోహంతో కళకళలాడాయి. ప్రత్యేక అలంకరణలు, పూజలతో కోలాహలంగా మారాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.పలుచోట్ల భారీగా బాణ సంచా కాల్చారు. రామాలయాల వద్ద ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఎస్.కోట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన కల్యాణోత్సవాల్లో ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు పాల్గొన్నారు. గుర్ల మండలం కెల్లలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి. సూర్యనారాయణరాజు దంపతులు సీతారాముల కల్యాణం జరిపించారు.

– సాక్షి నెట్‌వర్క్



చీపురుపల్లి: కస్పావీధిలో సీతారాముల కల్యాణం సందర్భంగా పుస్తెలు చూపిస్తున్న పురోహితులు



వేపాడ: సోంపురంలో సీతారామలక్ష్మణులను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు



లక్కవరపుకోట: శ్రీరాంపురంలో కల్యాణ వేదిక పైకి సీతాదేవిని తీసుకొస్తున్న వేదపండితులు, భక్తులు



లక్కవరపుకోట: ఎల్.కోట రామాలయంలో కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు



లక్కవరపుకోట: శ్రీరాంపురంలో మంగళ సూత్రాన్ని భక్తులకు చూపిస్తున్న వేదపండితుడు



శృంగవరపుకోట: ఎస్.కోటలో రాములోరి కల్యాణోత్సవానికి తరలి వెళ్తున్న భక్తులు



బొండపల్లి: కొవ్వాడపేటలో సీతారాముల కల్యాణానికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న సీతం కాలేజ్ ప్రిన్సిపాల్ శశిభూషణరావు దంపతులు



గజపతినగరం: పురిటిపెంట మారుతీనగర్ కాలనీలో నిర్వహించిన కల్యాణోత్సవంలో భక్తులు



జామి: గొడికొమ్ములో సీతారాముల కల్యాణం



జామి: అలమండలో మహిళల కోలాటం



కొత్తవలస: రామలింగాపురంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నాయుడుబాబు దంపతులు



చీపురుపల్లి: వంగపల్లిపేటలో సీతారాముల ఊరేగింపు



గుర్ల: కెల్లలో సీతారాముల కల్యాణోత్సవంలో కె.వి.సూర్యనారాయణరాజు దంపతులు



గుర్ల: గుర్లలో సీతారాముల ఊరేగింపు



చీపురుపల్లిరూరల్: నిమ్మలవలసలో సీతారాముల కల్యాణోత్సవంలో భక్తులు



వేపాడ: బానాదిలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న దంపతులు



వేపాడ: పాటూరులో అన్నదానం



దత్తిరాజేరు: పెదమానాపురంలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో పల్లకీని మోస్తున్న జెడ్పీటీసీ రాజేశ్వరి



దత్తిరాజేరు: గుచ్చిమిలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



.మెరకముడిదాం: సోమలింగాపురంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు



గజపతినగరం: పురిటిపెంటలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



గజపతినగరం రూరల్: పాతభగ్గాంలో పూజలు చేస్తున్న భక్తులు

ఏకశిలకు ఘనస్వాగతం పలుకుదాం



విలేకరుల సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, నాయకులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మిస్తున్న హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయానికి సంబంధించి పట్టణానికి చేరుకుంటున్న ఏకశిలకు శుక్రవారం ఘనస్వాగతం పలకనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీతో పాటు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడు తూ దాదాపు రూ.3 కోట్ల అంచనా వ్యయంతో పట్టణ శివారున అయ్యప్పస్వామి ఆలయాన్ని నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఆలయంలో 18 మెట్లు (పడిమెట్లు) ఏర్పాటుకు సంబంధించి గుంటూరు జిల్లా నుంచి దాదాపు రూ.8 లక్షల విలువైన ఏకశిలను రప్పిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం ఉదయం పట్టణంలో ఆంజనేయపురం వద్ద ఏకశిలకు భక్తులు పెద్ద ఎత్తున ఘనస్వాగతం పలకాలని కోరారు. అక్కడ పూజలు నిర్వహించిన అనంతరం భారీ ఊరేగింపుగా మెయిన్‌రోడ్, మూడు రోడ్ల జంక్షన్, లావేరురోడ్ మీదుగా అయ్యప్ప ఆలయానికి ఏకశిల చేరుకుంటుందని తెలిపారు. పట్టణంతో పాటు మండలంలోని భక్తులు అంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు గంట్యాడ విష్ణు, అప్పికొండ ఆదిబాబు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, ఒమ్మి రమేష్, మంగళగిరి శ్రీనివాసరావు, ఇప్పిలి తిరుమల, రౌతు పైడిరాజు, బూరాడ మహేష్, ఇప్పిలి కృష్ణ, పొంద్రంకి వాసు, పనస అప్పారావు పాల్గొన్నారు.

పశువుల రక్తనమూనాల సేకరణ



పశువుల నుంచి రక్త నమూనాలను సేకరిస్తున్న వైద్యాధికారి గాయిత్రీదేవి

లక్కవరపుకోట: పశువుల్లో గాలికుంటు వ్యాధి టీకాల పనితీరు పరిశీలించేందుకు మండలంలోని చందులూరు గ్రామంలో పశువుల నుంచి రక్తనమూనాలను పశువైద్యాధికారి కోరాడ గాయిత్రీదేవి ఆధ్వర్యంలో గురువారం సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పశువులకు ఉచితంగా గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను వేయిస్తోందని చెప్పారు. టీకా పనితీరును పరిశీలించేందుకు జిల్లాలో కొన్ని మండలాలను ఎంపిక చేశారు. చందులూరులో 13 పశువులను ఎంపిక చేసి టీకా వేసే ముందు వాటి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేశామని, టీకా వేసిన 21 రోజులు తర్వాత మళ్లీ రక్తనమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తున్నామని తెలిపారు. సచివాలయ పశు సహాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

విజయనగరం: శంకుస్థాపన వారోత్సవాల్లో భాగంగా నగరంలోని 28, 29, 30 డివిజన్‌లలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు గురువారం పర్యటించి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే శంకుస్థాపన వారోత్సవాలు పేరిట వారం రోజుల పాటు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. 28వ డివిజన్‌లో రూ. పది లక్షలు, 29వ డివిజన్‌లో రూ. ఆరు లక్షలు, 30 డివిజన్‌లో రూ. పదహారు లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఏప్రిల్ ఆరో తేదీ నుంచి పూర్తయిన పనులకు వారం రోజుల పాటు ప్రారంభ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల కృష్ణారావు పాల్గొన్నారు.

'దీక్ష'తో పరిపూర్ణత

విజయనగరం: భగవంతుడి దీక్ష చేపట్టిన వ్యక్తి పరిపూర్ణుడు అవుతాడని ప్రముఖ ఆడిటర్ ఈఆర్ సోమయాజులు అన్నారు. గురువారం స్థానిక పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో ఉత్తరాంధ్ర జిల్లాల భవానీ దీక్ష సేవాపీఠం ఆధ్వర్యంలో తెలుగు సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండాలన్నారు. సేవాపీఠం వ్యవస్థాపకుడు పులపా మల్లేశ్వరరావు మాట్లాడుతూ 'దీక్ష ' అనేది నేటిది కాదని, త్రేతాయుగంలో శ్రీరాముడు, ద్వాపర యుగములో శ్రీకృష్ణుడు, పాండవులు, మునులు ఎందరో దుర్గా దేవి దీక్ష చేసి విజయాలు సాధించారన్నారు. కాళిదాసు 'కాళీ మాత' దీక్ష చేపట్టి మహాకవి కాళిదాసుగా.. వీర శివాజీ భవానీ మాతను కొలి చి అనేక విజయాలు సాధించారని చెప్పారు. దీక్ష వల్ల క్రమశిక్షణ అలవడుతుందన్నారు. అనంతరం పంచముఖ ఆంజనేయ నిత్య అన్నప్రసాద వితరణ ట్రస్ట్ కార్యదర్శి పెంటపాటి కామరాజును సత్కరించారు.

రామాలయానికి మకరతోరణం బహూకరణ



సీతారామలక్ష్మణులకు అలంకరించిన దాతలు అందజేసిన మకరతోరణం

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారామలక్ష్మణులకు గ్రామానికి దాతలు రూ.80 వేల విలువైన మకరతోరణం బహూకరించారు. గ్రామానికి చెందిన పిల్లా వెంకటరమణ, ముమ్మన గణేష్, రామెల జోగినాయుడు, కర్రి సన్యాసిరావు రూ.20 వేల చొప్పున అందజేశారు. ఈ నిధులతో గోపురం ఆకారంతో మకరతోరణం తయారు చేయించారు. శ్రీరామనవమి సందర్భంగా సీతారామలక్ష్మణులకు గురువారం మకరతోరణం అలంకరించారు.

ఆర్యవైశ్యమహాసభ విజయవంతం



ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్‌రావు

గజపతినగరం: ఈనెల 26న గజపతినగరంలో నిర్వహించిన ప్రపంచ ఆర్యవైశ్య మహాసభకు రాష్ట్రం నలుమూలల నుంచి తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయ వంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు పూసర్ల మోహన్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి అండగా ఉంటామని భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు, ప్రపంచ ఆర్యవైశ్యమహాసభ (వామ్) అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణకు ఆయన ధన్యవాదాలు చెప్పారు. అదేరోజు ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా తనని, ప్రధాన కార్యదర్శిగా పూసర్ల బాబ్జి, ఉపాధ్యక్షుడిగా బండారు నూకరాజు, కోశాధికారిగా బొండా రమేష్‌ను సభ్యులు ఎన్నుకున్నారని తెలిపారు. అలాగే ఎనిమిది మండలాలకు అధ్యక్షులను ఎన్నుకున్నట్లు వివరించారు. ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

కోలాటం బృందానికి దుస్తుల పంపిణీ



కోలాటం బృందానికి దుస్తులు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు

వేపాడ: శ్రీరామనవమిని పురస్కరించుకుని కోలాటం బృందానికి విజయనగరం డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు తన స్వగ్రామం నీలకంఠరాజపురంలో సొంత నిధులతో గురువారం దుస్తులు పంపిణీ చేశారు. ఎల్.కోట మండలం గొర్లెవానిపాలెంకు చెందిన 25 మంది మహిళలు,పురుషులు అనకాపల్లి జిల్లా రామయోగి అగ్రహారానికి చెందిన గురువు కొల్లి రాములు నేతృత్వంలో శిక్షణ పొందుతున్నారు. వీరికి కోలాటానికి సంబంధించిన యూనిఫాం(రెండు చొప్పున చీరలు, పంచెలు)ను చినరామునాయుడు సమకూర్చారు.